ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
గురువారం
18 సెప్టెంబర్ 2025

శబరిమల విగ్రహాలపై 4.5 కిలోల బంగారం ఏమైంది..?

దర్యాప్తునకు కోర్టు ఆదేశం

కోచి, సెప్టెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది.



అసలేం జరిగిందంటే..శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూతపూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్టుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్టు కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో అనేక లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్కోర్ దేవస్వం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా పూర్తి నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది. శబరిమల స్పెషల్ కమిషనర్కు సమాచారం ఇవ్వకుండానే ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా వాటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించింది. దీనిపై బోర్డు నుంచి వివరణ కోరింది.

నిలిచిపోయిన టిడ్కో గృహ సముదాయాల పనులు ప్రారంభం: మంత్రి నారాయణ

అమరావతి, సెప్టెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): పెండింగ్లో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు రూ.6,300 కోట్లు అవసరమని మంత్రి నారాయణ అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా టిడ్కో ఇళ్ల నిర్మాణంపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

గత వైకాపా ప్రభుత్వం రూ.3,664 కోట్ల బిల్లులు పెండింగ్లో పెట్టిందన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆగిపోయిన టిడ్కో గృహ సముదాయాలను పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించామన్నారు.

ఏ సమస్య పైనైనా చర్చించేందుకు సిద్ధం: మంత్రి అచ్చెన్నాయుడు

రైతుల సమస్యలపై చర్చించాలని వైకాపా సభ్యులు శాసనమండలిలో నినాదాలు చేశారు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులపై ఎన్ని గంటలైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఏ సమస్య పైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి.. సీఎంకు విరాళమిచ్చిన మిర్యాలగూడ ఎమ్మెల్యే



హైదరాబాద్, సెప్టెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ.2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సీఎం అభినందించారు.

ఏపీలో రానున్న 3 గంటల్లో ఈ జిల్లాల్లో వర్షాలు

అమరావతి, సెప్టెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): రానున్న 3 గంటల్లో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే వీలుందని వెల్లడించింది.

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వాతావరణం మేఘావృతమై ఉండి అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'కల్కి 2' సడెన్ షాక్.. ప్రాజెక్ట్ నుంచి దీపికా ఔట్

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది."జాగ్రత్తగా ఆలోచించిన తర్వాత మేం ఒక నిర్ణయానికి వచ్చాం. 'కల్కి' సీక్వెల్లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం" అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. సైన్స్ ఫిక్షన్ మూవీగా 'కల్కి 2898 ఏడీ' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ప్రభాస్ భైరవ పాత్రలో కనిపించగా దీపికా పదుకొణె సుమతి పాత్రలో అద్భుతమైన నటనతో సినిమాకే హైలైట్గా నిలిచారు. ఇప్పుడు దీని సీక్వెల్లో ఆమె స్థానంలో ఎవరు నటిస్తారన్నదే హాట్ టాపిక్గా మారింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్

క్రికెటర్లు 'బాడీ బిల్డింగ్' చేయొద్దు.. జిమ్‌కు అవసరం లేదు: యోగ్రాజ్

ఫాస్ట్ బౌలర్లకు గాయపడటం సహజమే. అయితే, కోలుకున్నాక స్వల్ప వ్యవధిలోనే మళ్లీ సుదీర్ఘకాలం విశ్రాంతి అవసరమైతే అది కెరీర్పైనే తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. టీమ్ ఇండియాలో జస్ప్రీత్ బుమ్రా, షమీ, హార్దిక్ వంటి పేసర్లు గాయాలతో పోరాడుతూనే ఉన్నారు. అయితే, ఇలా వారు తరచూ గాయపడానికి కారణం ఏంటో యోగరాజ్ సింగ్ తెలిపారు. టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్రాజ్ సింగ్ అని అందరికీ తెలుసు."బుమ్రా ఇటీవల కాలంలో నాలుగుసార్లు గాయపడ్డాడు. దీనికి ప్రధాన కారణం జిమ్కు వెళ్లడమే. ఇతర క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. షమీ, పాండ్య.. ఇలా ఫాస్ట్ బౌలర్లకు గాయాలు ఎక్కువగా అవుతున్నాయి. ఒక్కసారి పాత రోజులను గుర్తు చేసుకుంటే.. విండీస్ మాజీ పేసర్ మైకెల్ హోల్డింగ్ బాడీ చాలా ఫ్లెక్సిబుల్గా ఉంటుంది. ఇక వివ్ రిచర్డ్స్ అయితే 35 ఏళ్లు వచ్చేవరకూ జిమ్కు వెళ్లలేదు. కానీ, మన క్రికెటర్లు జిమ్కు వెళ్లడం నన్ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 35 ఏళ్ల వయసు తర్వాతనే అక్కడికి వెళ్లాలి. లేకపోతే కండరాలు బిగుసుకుపోయి ఇబ్బంది పడాల్సి ఉంటుంది. మీకు 37 ఏళ్లు వచ్చినప్పుడు జిమ్కు వెళ్తే కాస్త ఉత్సాహం వస్తుంది. అప్పుడు మీ బలం పెరిగే అవకాశం ఉంది" అని యోగ్రాజ్ తెలిపారు.

ఇప్పుడు మాత్రం..

"ప్రస్తుత రోజుల్లో చాలా మంది యువ క్రికెటర్లు ఎక్కువగా జిమ్లో గడుపుతున్నారు. అందుకే.. వారికి గాయాలు అవుతున్నాయి. నలభై ఏళ్ల కిందట ఇంజ్యూరీ రేషియో సున్నా. క్రికెట్లో శరీరం ఫ్లెక్సిబుల్గా ఉండాలి. జిమ్నాస్టిక్స్ తరహాలో ఉంటేనే మైదానంలో యాక్టివ్గా ఉండొచ్చు. అందుకోసం పుల్అప్స్, పుష్ అప్స్, సిట్అప్స్ వంటి చేయండి. అంతేకానీ జిమ్లకు వెళ్లి భారీగా బరువులను ఎత్తొద్దు. మీకు బాడీ బిల్డింగ్ అవసరం లేదు" అని యోగరాజ్ వ్యాఖ్యానించాడు.

ఇంటి చిట్కాలు

మునగాకు కొన్ని వేల సంవత్సరాల నుంచి వీటిని మనం వంటల్లో అనేక రకాలుగా వాడుతుంటాం. దీనిలోని గుణాల కారణంగా మనకి ఎన్నోసమస్యలు దూరమవుతాయి. దానికోసం ఎలా తీసుకోవాలి.. ఏయే సమస్యలు దూరమవుతాయో తెలుసుకోండి.

సాధారణంగా ఇళ్లలో మునగాక పప్పు, మునగాకు కారం, మునగపొడి .. ఇలా అనేక రకాలుగా మునగాకుల్ని వాడతాం. మునగాకుల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. మరీ ముఖ్యంగా ఆరోగ్యకరమైన యాంటీ ఆక్సిడెంట్స్, బయోయాక్టివ్ ప్లాంట్ కాంపౌండ్స్ కూడా ఉన్నాయి. వీటిని మనం ఏదో రకంగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి.మునగలో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ప్రోటీన్, విటమిన్ బి6, విటమిన్ సి, ఐరన్, రిపోఫ్లేవిన్ బి2, విటమిన్, ఎ, మెగ్నీషియంలు ఉన్నాయి. ఇన్ని పోషకాలున్న మునగాకుతో టీ చేసి తాగితే ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

గుండె ఆరోగ్యం



మునగాకులోని గుణాల కారణంగా కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో పాటు బ్లడ్ ప్రెజర్ కూడా తగ్గుతుంది. మునగలోని గుణాలు ధమనుల్లో పేరుకుపోయిన కొవ్వు ఫలకాలని కరిగేలా చేస్తుంది. ఈ కారణంగా గుండెకి రక్త సరఫరా సరిగా జరుగుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. కాబట్టి, రెగ్యులర్గా ఈ టీని తాగండి.

మునగ ఆకుల్ని రోజూ తీసుకుంటే ధమనుల్లో పేరుకుపోయిన ఫలకం కరిగి గుండెకి మంచిది, ఎలా తీసుకోవాలంటే

బ్లడ్ షుగర్



మునగాకుల టీ తాగడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ రెగ్యులేట్ అవుతాయి. ఈ ఆకులు గ్లూకోజ్ లెవల్స్ని తగ్గిస్తాయి. కాబట్టి, షుగర్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. రెగ్యులర్ టీలు తాగే బదులు ఇలాంటి హెర్బల్ టీలు తాగడం వల్ల చాలా వరకూ సమస్య కంట్రోల్ ఉంటుంది.

డీటాక్స్

మునగాకుల్ని టీ చేసి తాగితే బాడీలో పేరుకుపోయిన టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. మునగాకుల్లో డీటాక్సీఫై గుణాలు పుష్కలంగా ఉననాయి. ఇందులోని ఐరన్ బాడీకి కావాల్సిన ఐరన్ని అందిస్తుంది. కాబట్టి, రెగ్యులర్గా ఈ టీని తీసుకునే ప్రయత్నం చేయండి.

జీర్ణ వ్యవస్థని కాపాడేందుకు

మునగాకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులతో టీ చేసుకుని తాగడం వల్ల మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యల్ని దూరం చేసి జీర్ణ వ్యవస్థని చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. ఈ ఆకులు ప్రేగు కదలికల్ని మెరుగ్గా చేసి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

ఇమ్యూనిటీ

మునగాకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూన్ సిస్టమ్ బూస్ట్ అవుతుంది. ఇందులోని యాంటీ మైక్రోబయల్ గుణాల కారణంగా ఇన్ఫెక్షన్స్ దూరమై సీజన్ చేంజ్ అయినప్పుడు వచ్చే సీజనల్ ప్రాబ్లమ్స్ని దూరం చేస్తాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.

ఎలా తయారుచేయాలి

ఈ టీ తయారుచేసేందుకు మనం కొన్ని తాజా మునగ ఆకుల్ని తీసుకుని నీటిలో వేసి మరిగించాలి. 4 నుంచి 5 నిమిషాల పాటు మరిగిన తర్వాత ఆ నీటిని తాగాలి. దీనికోసం మీరు ఎండిన మునగాకుల్ని కూడా తీసుకోవచ్చు. లేదంటే మునగాకు పొడినైనా వాడొచ్చు.